జహీరాబాద్‌పై కేసీఆర్ సమీక్ష

- ఎంపీ టికెట్ కోసం పలువురు నేతల పేర్లు పరిశీలన
- మండలాలవారీగా ప్రచార నిర్వహణ విధానంపై చర్చ

జహీరాబాద్ నియోజకవర్గ ముఖ్య నేతలతో చర్చిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో హరీశ్‌రావు, పోచారం, వేముల తదితరులు

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): పార్లమెంటరీ నియోజకవర్గాలవారీగా నిర్వహిస్తున్న సమీక్షలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ఆదివారం జహీరాబాద్ నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతలు, జిల్లా నాయకులు పాల్గొన్న ఈ సమావేశంలో అభ్యర్థి ఎంపికతో పాటు అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా నేతలకు కేసీఆర్ పలు సూచనలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన ప్రచార వ్యూహాలపై చర్చించారు. గ్రామాలవారీగా సమీక్షలు, మండలాలవారీగా రోడ్‌షోలు నిర్వహించాలని నిర్ణయించారు. హరీశ్‌రావు, ఇతర నేతలు పలువురు అభ్యర్థుల పేర్లను కేసీఆర్‌కు సూచించారు. తుది నిర్ణయం తీసుకునే బాధ్యతను పార్టీ అధినేతకే అప్పగించారు. ప్రధానంగా గాలి అనిల్‌కుమార్, శివకుమార్, మఠం భిక్షపతి తదితరుల పేర్లను పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యేల్లో ఎవరైనా పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నారేమో పరిశీలించాలని భావిస్తున్నారు. సోమవారం అభ్యర్థి పేరును ప్రకటించే అవకాశం ఉన్నది. కార్యక్రమంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, నేతలు గంప గోవర్ధన్, జాజల సురేందర్, హన్మంత్‌షిండే, గాలి అనిల్‌కుమార్, శివకుమార్, క్రాంతికిరణ్, దేవీప్రసాద్, జైపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ముజీబ్, పోచారం భాస్కర్‌రెడ్డి, సుమిత్ర ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ యురేనియం లొల్లి!

మొదటిపేజీ తరువాయి...

గుర్తించిన యూసీఐఎల్ (యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్), భారత అణు ఇంధన సంస్థ సర్వే చేపట్టి ఇక్కడ బోర్లు వేయించాయి. మండలంలోని పెద్దగట్టు, నంభాపురం, పెద్దమూల ప్రాంతాలు కృష్ణా పరీవాహకం కింద ఉండటంతో సాగర్ జలాలు కలుషితమైతే మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని స్థానికులు ఆందోళన చేపట్టారు. దీంతో 2003లో అప్పటి కలెక్టర్ సిసోడియా ఆధ్వర్యంలో పీఏపల్లి, శేరిపల్లి వద్ద ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా.. పలు పార్టీలు, ప్రజా సంఘాలు, పర్యావరణ వేత్తలు వ్యతిరేకించారు. అప్పటి శాసనసభ అసెంబ్లీలో తీర్మానం కూడా చేసింది. ఫలితంగా సర్వే నిలిపేశారు. ప్రస్తుతం నేరుగా కాకుండా.. ఆంధ్రా సరిహద్దు నుంచి వచ్చి హెలికాప్టర్ ద్వారా సర్వే చేపడుతున్నారని ఈ ప్రాంత వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలకిషన్, మాజీ ఎమ్మెల్సీ ప్రభాకర్, బీఆర్ఎస్ నేత బాలమల్లు తదితరులు

'కదనభేరి'కి ఏర్పాట్ల పరిశీలన

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 10 : కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించే బీఆర్ఎస్ కదనభేరి సభకు సంబంధించిన ఏర్పాట్లను పార్టీ నియమించిన ఇన్‌చార్జీలు మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ బాలమల్లుతో కలిసి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరీంనగర్‌తో కేసీఆర్‌కు ప్రత్యేక అనుబంధం ఉన్నదని అన్నారు. ఈ ఎన్నికలకు ఇక్కడి నుంచే శంఖారావం పూరిస్తున్నట్టు తెలిపారు. సభకు నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు.

బీఆర్ఎస్‌తో కలిసి ఎన్నికల్లో పోటీ

మొదటిపేజీ తరువాయి...

దూతగా రాజ్యసభ సభ్యుడు, కేంద్ర సమన్వయకర్త రాంజీగౌతమ్ హాజరవుతారని తెలిపారు. ఇరు పార్టీల మధ్య సీట్ల పంపకాలు, ఉమ్మడి భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే సంయుక్తంగా మీడియాకు వెల్లడిస్తామని పేర్కొన్నారు. బీఎస్పీ, బీఆర్ఎస్ పొత్తులపై మీడియాలో వస్తున్న నిరాధార వార్తలు, వదంతులు, దుష్ప్రచారాలను పార్టీ శ్రేణులు, ప్రజలు నమ్మవద్దని ప్రవీణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

25 లక్షలకుపైగా నీట్‌కు దరఖాస్తులు

- 16 వరకు గడువు పొడగింపు

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): జాతీయంగా ఉన్న ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్ (యూజీ)-2024 దరఖాస్తుల గడువును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) పొడగించింది. ఈ గడువు శనివారంతో ముగియగా, తాజాగా ఈ నెల 16 వరకు పొడగిస్తున్నట్టు ప్రకటించింది. అభ్యర్థులు ఈ నెల 16న రాత్రి 10:50 గంటల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశమివ్వగా, అదే రోజు రాత్రి 11:50 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించే అవకాశాన్నిచ్చింది. ఈ ఏడాది నీట్ (యూజీ)కు రికార్డు స్థాయిలో 25 లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. నిరుడు 20.8 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తులు సమర్పించగా, ఈ ఏడాది అదనంగా 4.2 లక్షల దరఖాస్తులు రావడం విశేషం. ఈ 25 లక్షల మందిలో 13 లక్షల మంది అమ్మాయిలు ఉన్నారు. జాతీయంగా 1.09 లక్షల ఎంబీబీఎస్, 26 వేల డెంటల్ సీట్లు ఉన్నాయి. నీట్ (యూజీ) పరీక్షను జాతీయంగా మే 5న మధ్యాహ్నం 2 గంటల నుంచి 5:20 గంటల వరకు నిర్వహించనున్న విషయం తెలిసిందే.

భారత జాగృతి కమిటీలన్నీ రద్దు

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): భారత జాగృతి కమిటీలన్నింటినీ రద్దుచేసినట్టు భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం సంస్థ కార్యాలయం ఒక విడుదల చేసింది. భారత జాగృతి గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ కమిటీలతో పాటు, విదేశాల్లో ఉన్న కమిటీలన్నింటినీ రద్దు చేశామని, తక్షణమే ఇది అమలులోకి వస్తుందని పేర్కొన్నారు.

బోనస్ ఇచ్చే దమ్ముందా?

మొదటిపేజీ తరువాయి...

ఏం చెప్పిండు? కల్యాణలక్ష్మికి రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్నడు. ఇచ్చిండా? అంటే అదే లక్ష ఇచ్చి చేతులు దులుపుకున్నడు. వంద రోజులు నిండినంకా కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టేది ఆడబిడ్డలే. మార్చి 15కు వందరోజుల సినిమా పూర్తవుతుంది. శిశుపాలుడు వంద తప్పులు చేసేదాకా ఆగినట్టు కాంగ్రెస్ వంద రోజుల పాలన వరకు ఆగుదాం. ఆ తర్వాత భరతం పడదాం' అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోడ్ పేరుతో తప్పించుకునే కుయుక్తులు చేస్తున్నదని దుయ్యబట్టారు. రైతులు కష్టాల్లో ఉన్నారని, పంటలు ఎండిపోతున్న రైతులకు నష్టపరిహారం కింద ఎకరానికి రూ.10 వేలు అందించాలని డిమాండ్ చేశారు. రూ.2లక్షల రుణమాఫీని తక్షణం వర్తింపజేయాలని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తాండవిస్తున్న కరువు.. కాలం తెచ్చింది కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని విమర్శించారు.

నిజామాబాద్ జిల్లా కామారెడ్డిలో బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో వేముల, గోవర్ధన్, జాజుల తదితరులు

రైతులు బాధపడుతున్నరు

'మొన్న గంగుల కమలాకర్‌తో కలిసి కరీంనగర్‌లో పంటలు ఎండిపోతే పరిశీలనకు వెళ్లిన. నలుగురైదుగురు రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటే గుండె తరుక్కుపోయింది. పంటలు ఎండుకపోయి రైతుల ముఖాల్లో జీవం పోయింది. అర్ధరాత్రి బాయి కాడికి పోయే రోజులు మళ్లా వచ్చాయని ఆ రైతులు చెబుతుంటే బాధనిపించింది. అంతా గందరగోళంగా ఉన్నది. బతుకులు ఆగమయ్యే పరిస్థితులున్నాయని వారంతా వివరించారు. కేసీఆర్ ఉన్నప్పుడు ప్రతి పంటకు యాభై వేలు వచ్చేదని, ఏడాదికి లక్ష వచ్చేదని పది ఎకరాల ఆసామి చెప్పిండు. ఇప్పుడు ఆ పైసల్ రాకపోగా బోరు రిపేర్లకు ఉల్టా లక్ష అయ్యిందని బాధపడ్డడు. తినే పల్లెంలో మట్టి పోసుకుంటిమి అని సామాన్య జనాల్లో బాధ కనిపిస్తున్నది. ఇప్పుడు మనం చేయాల్సిందల్లా ఒకటే. కొద్దిగా ధైర్యం, ఓపికతో ఎదురుదెబ్బను పక్కనపెట్టి పార్లమెంట్ ఎన్నికల్లో జైత్రయాత్రను మొదలుపెడదాం' అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

నిజాయితీగల్ల మోసగాడు రేవంత్‌రెడ్డి

'ఎలక్షన్లలో అనేక టీవీల్లో రేవంత్‌రెడ్డి ఖుల్లా ఒకటే చెప్పిండు. ప్రజలు మోసపోవాలనే కోరుకుంటారని, ప్రజలు మోసగాళ్లనే నమ్ముతారని నిజాయితీగా చెప్పిండు. నిజాయితీగల్లా మోసగాడు రేవంత్‌రెడ్డి. తప్పు ప్రజలది కాదు. మనం చక్కగా రేవంత్ రెడ్డి గురించి చెప్పలేకపోయాం. పొంకనాల పోతిరెడ్డి లెక్క ఎన్నో మాటలు చెప్పిండు. రైతులంతా లోన్లు తెచ్చుకోవాలని రెచ్చగొట్టిండు. డిసెంబర్ 9న రద్దు చేస్తానని చెప్పిండు. అధికారంలోకి వచ్చి మూడు నెలలైనా అతీగతీ లేదు' అని కేటీఆర్ తెలిపారు. మహబూబ్‌నగర్‌లో సీఎం పిచ్చిపిచ్చిగా మాట్లాడారని, పేగులు మెడలో వేసుకుంటానని అన్నారని, ఆయనేమైనా బోటీ కొట్టేటోడా? అని ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి పోయి ఏ ఎండకు ఆ గొడుగుపట్టే పొంకనాల పోతిరెడ్డి అని విమర్శించారు. 'ఎటు గాలి ఉంటే అటు పోతడు తప్ప ఆయనకో నీతి లేదు. సిద్ధాంతం లేదు. రేపు పార్లమెంటు ఎన్నికల తర్వాత రాహుల్‌గాంధీకి వెన్నుపోటు పొడిచి పక్కాగా బీజేపీలో చేరుతడు. అలాంటి పార్టీకి ఓట్లు వేసి పరోక్షంగా బీజేపీకి లాభం చేయవద్దు' అని తెలిపారు. రాష్ట్రంలో సగం కాంగ్రెస్, సగం బీజేపీ ప్రభుత్వం ఉన్నదని ఆరోపించారు.

అలాంటోళ్లను పార్టీలో చేర్చుకోం

పార్టీని వీడిపోతున్న వారిని తిరిగి చేర్చుకోబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తామని, బెల్లం చుట్టూ ఈగలు ముసురుకున్నట్టు మళ్లీ వస్తారని, అలాంటోళ్లను పార్టీలో తీసుకోబోమని తేల్చి చెప్పారు. ఈ నెల 12న కరీంనగర్‌లో జరిగే కదనభేరి సభను భగ్నం చేయాలని రేవంత్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. సభ రోజే మహిళలతో హైదరాబాద్‌లో మీటింగ్ ఏర్పాటుచేసి, బస్సులు దొరకనీయకుండా విషం గక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌కు గుదిబండలా మారారని, బీఆర్ఎస్‌కు ఓటు వేసి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. సమావేశాల్లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీచైర్‌పర్సన్ న్యాల కొండ అరుణ, రాజన్నసిరిసిల్ల జిల్లా పార్టీ అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు రాజారాం తదితరులు పాల్గొన్నారు.

గంప గోవర్ధన్ భావోద్వేగం

సమావేశంలో కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ భావోద్వేగానికి గురయ్యారు. సభలో గద్గదస్వరంతో ఆయన ప్రసంగం మొదలైంది. మొదటగా కేసీఆర్ ఓటమికి క్షమాపణలు కోరారు. ఈ సందర్భంగా కన్నీళ్లు పెట్టడంతో గులాబీ శ్రేణులంతా గంభీర వాతావరణంలో మునిగిపోయారు.

రేవంత్.. ఈ హామీలెక్కడ? (కేటీఆర్)

మహిళలకు రూ.2,500 ఇస్తానన్నవ్.. ఏమైంది?	రైతులకు బోనస్ ఇస్తానన్నవ్.. ఎక్కడ పోయింది?
కల్యాణలక్ష్మికి తులం బంగారం అన్నావ్.. ఏమైంది?	పింఛన్లను రూ.4 వేలకు చేస్తానన్నవ్.. ఏమైంది?
	ఎంతమంది ఉన్నా వృద్ధాప్య పింఛన్ ఇస్తానన్నవ్.. ఏమైంది?

పదిరోజులైనా పత్తా లేదు

> సిరిసిల్లలో నేను, కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి రాజీనామాలు చేసి గెలుద్దామని సవాల్ విసిరితే పది రోజులైనా పత్తాలేడు. ఇప్పటి వరకు మాటెత్తడం లేదు. దిక్కుమాలిన డైలాగులు బంద్ చేసి బుద్ధరఖాన్‌లా ఒర్రుడు మానుకుని ముఖ్యమంత్రిలా బిహేవ్ చెయ్. మగాడివైతే రైతులకు ఇస్తానని చెప్పిన బోనస్ ఇవ్వు. ఆడబిడ్డలకు మహాలక్ష్మి కింద రూ.2,500 అందివ్వు. రూ.4వేలు ఫించన్లు ఇవ్వు. దమ్ముంటే రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపించు. - కేటీఆర్

> సీఎంకు చిత్తశుద్ధి ఉంటే, రైతుల మీద ప్రేమే ఉంటే మేడిగడ్డను రిపేర్ చేయించి సాగుకు నీళ్లివ్వాలి. మూడు పిల్లర్లు రిపేర్ చేయించే తెలివి సీఎంకు లేదు. తప్పు జరిగితే శిక్షించాలి. చర్యలు తీసుకోవాలి. కాంగ్రెస్ హయాంలో కడెం ప్రాజెక్టు రెండు సార్లు కొట్టుకుపోయింది. వరంగల్‌లో గుండ్ల వాగు ప్రాజెక్టు రెండు సార్లు కొట్టుకుపోయింది. నాగార్జున సాగర్, శ్రీశైలం, ప్రకాశం, ధవళేశ్వరం ప్రాజెక్టుల్లోనూ సమస్యలు వచ్చాయి. - కేటీఆర్

'మహాలక్ష్మి' హామీ ఏమయ్యింది?

- కాంగ్రెస్ సర్కారుపై పలుచోట్ల మహిళల ప్రశ్నల వర్షం
- ప్రతి మహిళకు రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ హామీ
- ఇప్పటివరకు ఆ దిశగా అడుగులు వేయని రాష్ట్ర సర్కారు
- ఎన్నికల కోసం తాజాగా వడ్డీలేని రుణాలు ఇస్తామంటూ ఎర
- రేపు మహిళా సంఘాలతో హైదరాబాద్‌లో భారీ సభ

హైదరాబాద్, మార్చి10 (నమస్తే తెలంగాణ): మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకూ నెలకు రూ.2,500 ఇస్తామన్నారు.. ఆరు గ్యారెంటీల్లో భాగంగా అమలు చేస్తామన్నారు.. మూడు నెలలు దాటినా దాని ఊసే ఎత్తడం లేదు.. మరేదో చేస్తామంటూ ఊదరగొడుతున్నారు.. అంటూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలపై అడుగడుగునా మహిళలు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మహిళల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతో కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు మరో ఎత్తుగడ వేసినట్టు తెలుస్తున్నది. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ మరో మూడు నాలుగు రోజుల్లో రానున్న నేపథ్యంలో మహిళలను బురిడీ కొట్టించేందుకు డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలను ఇస్తామంటూ ప్రకటనలు చేస్తున్నది. అందులో భాగంగానే 12న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డ్వాక్రా సంఘాలకు చెందిన లక్ష మంది మహిళలతో హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో సమావేశం నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించింది. రాష్ట్రంలోని 4,39,717 స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 47,36,868 మంది సభ్యులకు వడ్డీలేని రుణాలను అందిస్తామని చెప్తున్నది.

మండిపడుతున్న మహిళలు

వడ్డీలేని రుణాల హామీపై మహిళలు మండిపడుతున్నారు. ఆరు గ్యారెంటీలను ప్రథమ ప్రాధాన్యంగా తీసుకొని అమలు చేస్తామని గప్పాలు కొట్టిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 అందించే అంశాన్ని వదిలిపెట్టి వడ్డీలేని రుణాలంటూ పాటపాడటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది కేవలం ఎన్నికల ఎత్తుగడ తప్ప ఏమీ లేదని విమర్శిస్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే మహాలక్ష్మి పథకాన్ని ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ప్రారంభించాలని, ముందుగా దాని మార్గదర్శకాలను జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వస్త్ర పరిశ్రమ బంద్‌తో కార్మికుల పస్తులు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 10 : సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమ బంద్ పాటిస్తుండటంతో ఉపాధి లేక కార్మికులు పస్తులు ఉంటున్నారని, ప్రభుత్వం కార్మికులకు వెంటనే పని కల్పించాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సిరిసిల్ల బీవైనగర్‌లో మీడియాతో మాట్లాడారు. బంద్‌లో భాగంగా సోమవారం వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాలు, పవర్‌లూం, వార్పిన్, వైపని, ఆసామి, జాఫర్, గుమస్తా, కండెలు చుట్టే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించనున్నట్టు తెలిపారు. అన్నిరంగాల వారు యజమానుల తోసహా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 15 రోజులుగా పరిశ్రమ బంద్ పడ్డా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు, ఆసాములు ఉపాధి కల్పించాలని రోడ్డెక్కి అరుస్తున్నా, కార్మికుల ఆకలి కేకలు ప్రభుత్వానికి వినిపించడం లేదా? అని ప్రశ్నించారు.

కరువు యాత్ర చేపట్టాలి

ఢిల్లీ టూర్లతో కాలం గడుపొద్దు

- యాసంగికి నీళ్లు ఎప్పుడిస్తారో చెప్పాలి
- తాగు, సాగునీళ్లు లేక రాష్ట్రంలో ప్రజలు అల్లాడుతున్నారు
- సీఎంకు సోయి ఉంటే కర్ణాటక నుంచి నీళ్లు రప్పించాలి
- పాలం ఎండిపోతున్నదంటే రైతులపై కేసులు పెడ్తారా?
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆగ్రహం

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి, చిత్రంలో గ్యాదరి కిశోర్

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలు మానుకొని, రాష్ట్రంలో కరువు పర్యటనలు చేయాలని, రైతులకు భరోసా కల్పించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనంతో తెచ్చిన కరువు కారణంగా రైతులు అల్లాడిపోతున్నారని మండిపడ్డారు. ఆదివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి తక్షణమే వ్యవసాయ, సాగునీటి శాఖలపై సమీక్షలు చేపట్టి, రైతులను ఆదుకోవాలని కోరారు. తాగునీళ్లు లేక ప్రజలు, సాగునీళ్లు లేక రైతులు అల్లాడిపోతుంటే కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మానవబాంబులను తయారుచేయడానికి ఉగ్రవాదివా? పేగులు మెడలో వేసుకొని తిరగడానికి కసాయోడివా? ముఖ్యమంత్రివా..?' అని ప్రశ్నించారు. 'మూడు నెలల అసమర్థ పాలన వల్ల లక్షలాది రైతుల పేగులను మెడలో వేసుకున్నవ్.. ఆ పాపం ఊరికే పోదు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ మార్క్ మార్పుతో మూడు నెలల్లోనే రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తున్నదని ఎద్దేవా చేశారు.

కర్ణాటక నుంచి నీళ్లు తేవాలి

కాంగ్రెస్ నేతలు నిష్ప్రయోజనంగా మార్చుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఇప్పటికీ రైతులకు సాగునీరు అందించే అవకాశం ఉన్నదని జగదీశ్‌రెడ్డి చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారే ఉన్నదని, అక్కడి ప్రాజెక్టుల నుంచి నీళ్లు తీసుకొనిరావాలని కోరారు. ఇన్నిసార్లు ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రికి ఢిల్లీ పెద్దల ద్వారా కర్ణాటక నేతలతో మాట్లాడించి నీళ్లు తెచ్చే దమ్ములేదని దుయ్యబట్టారు. గతంలో రైతులు కేసీఆర్‌పై భరోసాతో ఉండేవారని, ఎలాగైనా అన్ని పంటలకు నీళ్లు ఇస్తారనే నమ్మకంతో ఉండేవారని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను ఎండబెడుతున్నదని మండిపడ్డారు. నీళ్లు లేక రైతులు పంటలను పశువుల మేతకు వదిలే దారుణ పరిస్థితులను కాంగ్రెస్ తీసుకొచ్చిందని విమర్శించారు. సాగర్ ఎడమకాల్వ ఆయకట్టు ఎండిపోతుంటే నల్లగొండ మంత్రులకు, ముఖ్యమంత్రికి సోయిలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటే ఈ దుస్థితి ఉండేదా? అని ప్రశ్నించారు. పంటలపై నాడు తమకొక అంచనా ఉండేదని, నేటి ప్రభుత్వానికి ముందస్తు అంచనా ఏమీలేదని దుయ్యబట్టారు. ఢిల్లీకి ముడుపులు, మూటలు సర్దడంపైనే కాంగ్రెస్ నేతలకు ముందుస్తు ప్రణాళిక ఉన్నదని ఎద్దేవా చేశారు.

దమ్ముంటే కొత్తగా నోటిఫికేషన్లు ఇవ్వాలి

కేసీఆర్ నిర్మించిన బ్రిడ్జీలకు శంకుస్థాపనలు చేయడం, ప్రాజెక్టులకు కొబ్బరికాయలు కొట్టడం, కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు నియామకపత్రాలు ఇవ్వడం కాదని, సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని జగదీశ్‌రెడ్డి సవాల్ చేశారు. ప్రాజెక్టులు నీటికి కొట్టుకుపోతే బాగుండనే దుర్మార్గపు ఆలోచన ఇకనైనా మానుకోవాలని హితవు చెప్పారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నవారిపై కేసులు పెట్టడం, చిత్రహింసలకు గురిచేయడం దారుణమని మండిపడ్డారు. మంచినీళ్లు లేవని, సాగునీరు లేక పొలం ఎండిపోయిందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా కేసు పెట్టిస్తావా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్ చర్యల వల్ల గ్రామాలతో సహా హైదరాబాద్‌కు సైతం తాగునీటి సమస్య రాబోతున్నదని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్, బీఆర్ఎస్ నాయకులు ఊర నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

తూతూమంత్రంగా ధరణి స్పెషల్ డ్రైవ్

- 9వ తేదీకే పూర్తయినగడువు
- 45 శాతం అర్జీలకే పరిష్కారం
- అన్నీ గత ప్రభుత్వ హయాంలో దాదాపు కొలిక్కి వచ్చినవే?
- ఎన్ని పరిష్కరించారో చెప్పకోలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం
- స్పెషల్ డ్రైవ్ ఉన్నదో, లేదో తెలియదంటున్న అధికారులు

స్పెషల్ డ్రైవ్ ముగిసిందా? పొడిగించారా?

> ధరణి దరఖాస్తుల స్పెషల్ డ్రైవ్‌ను ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. తహసీల్దార్ స్థాయి నుంచి సీసీఎల్ఏ వరకు కమిటీలు వేసి, వాటికి బాధ్యతలు అప్పగించి, నిర్దిష్ట గడువు విధించింది. ప్రకటనల వరకు బాగానే ఉన్నా.. పనిలోకి వచ్చేసరికి తొలిరోజు నుంచే మౌనం పాటిస్తున్నది. ఎన్ని బృందాలు ఏర్పాటు చేశారు? వారికి శిక్షణ ఎలా ఇచ్చారు? దరఖాస్తులు ఎన్ని పరిష్కరించారు? వంటి వాటినే ప్రభుత్వం చెప్పుకోలేకపోయింది. మధ్యలో ఓసారి రెవెన్యూ శాఖ మంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రెస్‌నోట్‌ను విడుదల చేశారు. అందులో ఎన్ని దరఖాస్తులు డిస్పోజ్ చేశారో మాత్రమే చెప్పారు. ఆ తర్వాత శనివారం నాటికి గడువు పూర్తయినా, నిర్దేశించిన సమయంలో ఎన్ని పూర్తయ్యాయో చెప్పుకోలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉన్నది. స్పెషల్ డ్రైవ్ ముగిసిందా? దానిని పొడిగిస్తున్నారా? అసలు ఏ స్థితిలో ఉన్నదో అన్న విషయాలు కనీసం అధికారులకు కూడా తెలియకపోవడం గమనార్హం.

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్పెషల్ డ్రైవ్' ఉత్తుత్తి డ్రామా అని తేలిపోయింది. రెవెన్యూ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమం విఫలమై లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు చేసిన ఎన్నికల స్టంట్‌గా తేలిపోయింది. గడువు ముగిసినా ఎన్ని దరఖాస్తులు పరిష్కారమయ్యాయో చెప్పుకోలేని స్థితిలో ప్రభుత్వం ఉన్నదంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ధరణి పోర్టల్‌లో మొత్తం 16 మాడ్యూళ్ల కింద 2.45 లక్షల పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయని, వాటిని 9 రోజుల్లో పరిష్కరిస్తామంటూ ప్రభుత్వం ఈ నెల ఒకటి నుంచి స్పెషల్ డ్రైవ్ ప్రారంభించింది. మండల స్థాయి నుంచి సీసీఎల్ఏ వరకు కమిటీలు వేసి, వాటికి మార్గదర్శకాలు విడుదల చేసి హడావుడి చేసేసింది. ప్రభుత్వం నిర్దేశించిన గడువు శనివారంతో ముగిసింది. కానీ లక్ష్యంలో కనీసం సగం కూడా పూర్తి కాలేదని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి.

గతంలో కొలిక్కి వచ్చినవాటికే మోక్షం?

ధరణిలో సుమారు 1.10 లక్షల పెండింగ్ దరఖాస్తులు పరిష్కారమైనట్టు సమాచారం. అయితే ఈ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొలిక్కి వచ్చినవేనని చెప్తున్నారు. గతంలో కలెక్టర్లు క్షేత్రస్